# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## నేస్తమా.. ఇక సెలవు

**డాక్టర్** మన్మోహన్ సింగ్ మృతితో దేశం ఓ మహానేతను కోల్పోతే తెలంగాణ ఓ ఆత్మీయ స్నేహితుడిని కోల్పోయింది. తెలంగాణ గోస తెలుసుకొని మసులుకున్న ఏకైక ప్రధానిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోతారు. జవహర్‌లాల్ నెహ్రూ విడాకులు తీసుకోవచ్చనే నమ్మికను చూపించి తెలంగాణను ఉమ్మడి రాష్ట్రంలో కలిపేసి చేతులు దులుపుకొన్నారు. సౌభాగ్యానికి, సౌహార్దానికి నిలయమైన హైదరాబాద్ రాష్ట్రాన్ని భాషా ప్రయుక్తం పేరిట మూడు ముక్కలు చేసి మూడు దిక్కులకు విసిరేశారు. తెలంగాణ మెడకు సమైక్య గుదిబండను తగిలించారు. అయినా ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షలు ప్రజ్వలించడం ఆగలేదు. తర్వాత ప్రధాని పదవి చేపట్టిన ఇందిరాగాంధీ ఉత్తుంగ తరంగమై లేచిన తొలిదశ ఉద్యమాన్ని అణచివేసి, అటకెక్కించే దాకా నిద్రపోలేదు. అదే కాంగ్రెస్ పరంపరలో కీలక పదవిని చేపట్టి భిన్నవైఖరి ప్రదర్శించిన విభిన్న నేత మన్మోహన్. కుటిల కాంగ్రెస్ పన్నాగాల పంకిలంలో అచ్చమైన ఆణిముత్యంలా నిలిచారాయన. అధిష్ఠానం నీడలో అష్టదిగ్బంధాల మధ్య ఆయన ప్రభుత్వం సాగడం తెలిసిందే. అయినప్పటికీ తెలంగాణ ఆవిర్భావం కోసం లోపలి నుంచి పావులు కదిపిన చతురుడాయన. నమ్మకద్రోహాలు, వెన్నుపోట్ల మధ్య కత్తి మీద సాము చేసి కార్యాన్ని నెరవేర్చిన ధీశాలి ఆయన.

మలిదశ ఉద్యమం మనసెరిగి ప్రజల కాంక్షను చెవియొగ్గి విని, చేయూతనందించిన మహానుభావుడు మన్మోహన్. కేసీఆర్ అవిశ్రాంత కృషితో ఉద్యమం ఊపందుకొని తారస్థాయికి చేరుకున్నది ఆయన హయాంలోనే కావడం యాదృచ్ఛికం కాదు. ఆ ఇద్దరు నేతల అనుబంధం తెలంగాణ ప్రజల భవితకు భరోసాగా నిలిచింది. రాజకీయ ఊగిసలాటలో తెలంగాణ పడిపోయినప్పుడు ఉక్కుస్తంభంలా అండదండలు అందించిన సహృదయుడు ఆయన. రాజకీయ శషభిషల హోరులో తెరవెనుక ఆయన పోషించిన పాత్ర చిన్నదేం కాదు. స్వరాష్ట్ర కాంక్ష అంతిమగమ్యం చేరడంలో చోదకశక్తిగా పనిచేసిన ఈ కపటం లేని కర్మయోగి సహజంగానే ప్రచార ఆర్భాటాలకు నోచుకోలేదు. నిలిచి గెలిచిన తెలంగాణ కేసీఆర్ సారథ్యంలో సాధించిన ప్రగతి పరుగులు చూసి మురిసిపోయిన విజ్ఞుడు, రాజనీతిజ్ఞుడు మన్మోహన్.

భారత రాజకీయాల్లో ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ రాక ఒక అనూహ్యమైన, అద్భుతమైన మలుపు. ఆయన వ్యక్తిత్వం ప్రతిభాసామర్థ్యాలు, నీతి నిజాయితీల కలగలుపు. తెలంగాణ మలిదశ పోరాటంలో ఆయన ఆశీస్సులే గెలుపు మలుపు. ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా ఆయన చూపిన చాకచక్యం అనితర సాధ్యం. భారత ఆర్థికవ్యవస్థ సంకెళ్లు తెంచి పరుగులు పెట్టించడం అద్వితీయం. ఇరవై ఏండ్ల కిందట యూపీఏ సర్కారు అధికారంలోకి వచ్చినప్పుడు ఏర్పడిన రాజకీయ శూన్యంలో ప్రధాని పదవి వరించడం ఆయన పరిపాలనా సామర్థ్యానికి దక్కిన గౌరవంగానే భావించాలి. సంక్లిష్ట సమయంలో దేశానికి దశ, దిశ చూపించిన దార్శనికుడు మన్మోహన్. తెలంగాణ రాష్ట్ర ప్రాదుర్భావ ఘట్టాన్ని ఒడుపుగా నెరవేర్చిన మౌన ముని. ఎదిగిన కొద్దీ ఒదిగిపోయిన జ్ఞాన ఖని.

## కొత్త ప్రభుత్వం.. చేదు అనుభవం



**జి.దేవీప్రసాద్ రావు**

**సుమారు పదేండ్ల పాటు సుభిక్షంగా వర్ధిల్లిన తెలంగాణ 2024లో అనేక చేదు అనుభవాలను ఎదుర్కొన్నది. దీంతో కొత్త ఏడాది ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజల్లో మొదలైంది. అనేక త్యాగాలు, వీరోచిత పోరాటాల ఫలితంగా కేసీఆర్ నాయకత్వంలో తెచ్చుకున్న తెలంగాణ ఏడాదిలోనే తెర్లు కావడానికి దారులు పడటం విషాదం. 2014 నుంచి 2023 వరకు సాగిన కేసీఆర్ పాలన తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది. అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపింది. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వయం పాలన వంటి అనేక అంశాలు తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించాయి. ఉద్యమ కాలంలో ప్రజలు అనుభవించిన కష్టాలను ప్రభుత్వ ఎజెండాగా చేసుకున్న కేసీఆర్ గుణాత్మక మార్పును అందించారు.**

కేసీఆర్ పాలన కంటే మెరుగైన పాలన అందిస్తామని, సంక్షేమాన్ని రెట్టింపు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసింది. ఈ విషయం ఏడాది కాలంలోనే ప్రజలకు అర్థమైంది. తెలంగాణలో వ్యవసాయాన్ని ప్రోత్సహించి సాగుబడి పెంచడానికి, దశాబ్దాల పాటు సంక్షోభంలో కూరుకుపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే మొదటిసారి రైతుబంధును ప్రవేశపెట్టింది. 2018 నుంచి 2023 వరకు రూ.72 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. నిరుడు అక్టోబర్‌లో ఇవ్వాల్సిన రైతుబంధును ఇవ్వకుండా ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించిన కాంగ్రెస్ పార్టీ రైతుల నోట్లో మట్టి కొట్టింది. అధికారంలోకి వచ్చాక రైతులకు ఎకరానికి ఏటా రూ.15,000 ఇస్తామని చెప్పి ఏడాది దాటినా అతీగతీ లేకుండాపోయింది. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు నానా కుట్రలు పన్నుతున్నది.

> **కుటుంబంలో ఒకరికే ఇస్తామని, ఉద్యోగులకు, పన్ను చెల్లింపుదారులకు ఇవ్వబోమని, ఏడెకరాల వరకు భూ పరిమితి విధిస్తామంటూ లీకులు మాత్రం ఇస్తున్నది. సంక్రాంతి పండుగకు ఇస్తామని చెప్తున్నా, దానిపైనా స్పష్టత లేక రైతాంగం ఆందోళన చెందుతున్నది.**

రుణమాఫీ కూడా రూ.40 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్లకు తగ్గించింది. రైతు కూలీలకు ఏడాదికి ఇస్తామన్న రూ.12 వేలకు దిక్కు లేదు. వానకాలంలో 66.78 లక్షల ఎకరాల్లో 156 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే 30 శాతం (47 లక్షల టన్నులు) మాత్రమే కొనుగోలు చేసింది. రూ.2,500 కోట్ల బోనస్ ఇవ్వాల్సిన ప్రభుత్వం రూ.900 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకొన్నది.




2014-15లో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు 2022-23 నాటికి 2.29 కోట్లకు పెరగడానికి కేసీఆర్ అనుసరించిన విధానాలే కారణం. ఆర్బీఐ నివేదికతో ఇది తేటతెల్లమైంది. అలాగే, 2014-15లో 62.49 లక్షల ఎకరాలున్న ఆయకట్టు 2022-23లో 159.97 లక్షల ఎకరాలకు చేరడం కూడా కేసీఆర్ పాలనాదక్షతకు నిదర్శనం.

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల వంద రోజుల హామీ ఏడాది గడిచినా అతీగతీ లేదు. ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు ఇంటి స్థలం, మహిళలకు రూ.2,500 భృతి, నెలవారీ ఫించన్ రూ.4 వేలకు పెంపు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. 2025లోనైనా కోతలు లేకుండా గ్యారెంటీలు అమలు చేస్తారో, లేదోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం హామీ ఏడాదిగా నవ్వుల పాలవుతున్నది. కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్య భక్షణగా మారింది. ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నందుకు చిక్కడపల్లి లైబ్రరీలో విద్యార్థులపై ప్రభుత్వం లాఠీచార్జి చేయించింది. అశోక్‌నగర్‌ను శోకనగర్‌గా మార్చింది. 2 లక్షల ఉద్యోగాలని చెప్పి 10 వేలు మాత్రమే భర్తీచేసింది. గత ప్రభుత్వం పూర్తిచేసిన 40 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి తమ ఖాతాలో వేసుకున్నది. జాబ్ క్యాలెండర్ జాదు క్యాలెండర్ అయింది. నిరుద్యోగ భృతి ఆలోచన లేకుండానే ఏడాది గడిచిపోయింది.

ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా లగచర్ల రైతులు తెలిపిన ధర్మాగ్రహంపై ప్రభుత్వ నిర్బంధం ప్రజలను కలచివేసింది. రామన్నపేటలో సిమెంట్ కంపెనీ ఏర్పాటును నిరసించిన ప్రజలపై జరిగిన దాడిని ప్రజలు మర్చిపోలేదు. జాతీయస్థాయిలో అదానీ, అంబానీలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మాత్రం వారికి అండగా నిలవడం దుర్మార్గం. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిరసన తెలిపిన ప్రజలపైనా నిర్బంధాన్ని ప్రదర్శించారు. ఆశా కార్యకర్తలపై లాఠీచార్జి చేయించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 4 ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. హామీలు అమలు చేయాలని గొంతెత్తుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులు కాంగ్రెస్ ఏడాది పాలనకు నిదర్శనం. లగచర్ల ఘటనలో మాజీ శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డిని నెలల పాటు జైలులో నిర్బంధించారు. గుండెపోటుతో వచ్చిన రైతుకు బేడీలు వేశారు.

ఇది ఇలా ఉంటే.. హెల్త్ స్కీం జాడలేదు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు 20 రోజులకు పైగా సమ్మె చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు టోకెన్ సమ్మె చేస్తున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర ఉద్యోగులకు ఏడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి దానికీ సబ్‌కమిటీ వేసి ప్రభుత్వం చేతులు దులుపుకొంటున్నది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటు. తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పులు, విగ్రహం చేతి నుంచి బతుకమ్మ మాయం వంటివాటిని ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణ లోగో నుంచి చార్మినార్, కాకతీయ తోరణం తీసేసే కుట్ర జరుగుతున్నది. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం సాంస్కృతిక విధ్వంసానికి పాల్పడుతున్నది. తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడినప్పుడల్లా ప్రజలకు కేసీఆర్ గుర్తొస్తున్నారు. 2025లోనైనా కాంగ్రెస్ పాలనా విధానంలో మార్పు రావాలి. ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. లేదంటే సబ్బండ వర్ణాల తరపున పోరాడేందుకు బీఆర్‌ఎస్ నాయకత్వం సిద్ధంగా ఉన్నది.

**(వ్యాసకర్త: రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్)**

## వారసత్వ రాజకీయ మీమాంస



**టంకశాల అశోక్**

**వారసత్వ రాజకీయాలపై వాదోపవాదాలు అనేకం వింటుంటాము గాని, విషయాన్ని లోతులకు వెళ్లి అర్థం చేసుకునే చర్చలు కనిపించటం లేదు. వారసత్వ రాజకీయాలు భారతదేశంలోనే కాదు, అనేక ఆసియన్, ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్, పాశ్చాత్య దేశాలలోనూ ఎందుకున్నాయన్నది మనం వేసుకోవలసిన మొదటి ప్రశ్న. వారసత్వ రాజకీయాలన్నవి ప్రపంచం ఆధునిక ప్రజాస్వామ్య దశలోకి ప్రవేశించటానికన్న ముందటి మధ్యయుగాల కాలంలో, ఇంకా చెప్పాలంటే అంతకన్న వెనుకటి ఆదిమ జాతి సమాజాలలోనే ఆవిర్భవించగా, ప్రజాస్వామ్య వ్యవస్థలలోనూ కొనసాగటానికి గల కారణాలేమిటన్నది రెండవ ప్రశ్న. అవి నిజంగా ప్రజాస్వామ్య విరుద్ధమా, లేక అంతిమంగా ఆ రాజకీయం ఏ దశలోనైనా సరే ప్రజలు ఆమోదించటం, లేదా తిరస్కరించటంపై ఆధారపడి సాగుతున్నదా అనేది మూడవ ప్రశ్న.**

ఇప్పుడు కొన్ని ఉదాహరణలు చూద్దాము. నెహ్రూ-గాంధీ వంశంలో మోతీలాల్, జవహర్‌లాల్, ఇందిర, రాజీవ్‌ల తర్వాత సోనియా, రాహుల్ గాంధీ రంగంలోకి వచ్చారు. వీరిలో మోతీలాల్ స్వాతంత్య్రోద్యమ కాలంలో తన ప్రతిభ కారణంగా పార్టీ అధ్యక్షునిగా ఆమోదం పొందారు. తర్వాత నెహ్రూ, ఇందిరాగాంధీల గురించి తెలిసిందే. అయితే ఇందిర, రాజీవ్, సోనియాల దశ వచ్చేసరికి ఒడిదుడుకులు మొదలై, ప్రస్తుతం రాహుల్ కాలంలో పరిస్థితి ఎందువల్ల బాగా క్షీణించింది? సూటిగా చెప్పుకోవాలంటే వీరందరిదీ వారసత్వ రాజకీయమే. అయితే ఆ వంశస్థులకు ప్రతిభా సామర్థ్యాలుండి, బాగా పాలించినపుడు ప్రజామోదం లభించింది. ఈ రెండూ లేనపుడు, ముఖ్యంగా పరిపాలన సరిగా లేనపుడు, ప్రజలు తిరస్కరిస్తూ వచ్చారు. అంతే తప్ప, వారిది ఒకానొక వంశమా కాదా అన్నది ప్రజల దృష్టిలో సమస్య కాలేదు. ఒక వంశస్థులు పాలించటానికి ప్రజాస్వామ్యం అనే సిద్ధాంతంతో మమేకత ఉందా లేక వైరుధ్యమా అన్నది వారి దృష్టిలో ఒక ప్రశ్న కాలేదు. ఇంతకూ వారసత్వమన్నది ప్రజాస్వామ్యం అనుకునే ఆధునిక వ్యవస్థల్లో సరైనదేనా అంటే అవుననలేము. కాని, అసలు ఈ విధమైన రాజకీయాలు ఎందుకు కొనసాగుతున్నా




యన్నది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన మొదటి విషయం కాగా, అందుకు ప్రత్యామ్నాయత అన్నది ఏ పరిస్థితులలో ఎప్పుడు ఆవిర్భవించి ప్రజామోదాన్ని ఏ విధంగా పొందుతుందన్నది రెండవ విషయం. ఇటువంటి సమగ్ర అవగాహనలు లేకుండా కేవలం వారసత్వ రాజకీయాలను షరామామూలుగా ఆక్షేపించటం వల్ల కలిగే ప్రయోజనం ఉండదు.

ఇపుడు మరికొన్ని ఉదాహరణలను చెప్పుకుందాం. తమిళనాడులో కరుణానిధి, ఆయనకు వారసునిగా స్టాలిన్ రాగా, ఉదయనిధి ఇంకా పూర్తిస్థాయి పాలకుడు కాలేదు గాని, ఇంతవరకైతే పార్టీలో గాని, ప్రజలలో గాని వ్యతిరేకతలు కన్పించటం లేదు. అందుకు ఏకైక కారణం సమర్థతలు, మంచి పాలన. ఇదే పద్ధతిలో ఇంకా అనేక రాష్ట్రాలలో, పార్టీలలో పలు ఉదాహరణలు చెప్పవచ్చు. వారసత్వ రాజకీయాలను ఇంతగా విమర్శించే బీజేపీలో కూడా. ఆ పార్టీలో వారసత్వం ప్రధాని, పార్టీ అధ్యక్ష స్థాయులలో లేకపోవటానికి, దిగువస్థాయులలో ఉండటానికి కూడా కారణాలున్నాయి. ఆ మాటకు వస్తే కమ్యూనిస్టులలో ఏ స్థాయిలోనూ అనువంశిక రాజకీయాలు కన్పించవు. కనుక, కుటుంబ వారసత్వాలే ప్రజాస్వామికతకు ఏకైక గీటురాయి అయ్యే పక్షంలో మన దేశంలో కమ్యూనిస్టులకు మించి ప్రజాస్వామికులు లేరు.

లాటిన్ అమెరికా, ఆఫ్రికాల వరకు వెళ్లకుండా ఆసియాలోనే మన పొరుగు దేశాలను గమనిస్తే పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంకలలో ఏమి జరుగుతూ వస్తున్నదో తెలిసిందే. వీటన్నింటా గల వంశాలను ప్రజలు పరిపాలనలు బాగున్నప్పుడు ఆమోదించి, లేనప్పుడు తిరస్కరించారు. సరికొత్తగా బంగ్లాలో షేక్ హసీనా, శ్రీలంకలో గతకాలపు వివిధ కుటుంబాలన్నింటిని అధికారం నుంచి పారదోలి, కొత్త శక్తులను అదే కారణంగా అధికారంలోకి తెచ్చారు ప్రజలు. ఈ విధమైన ఆమోదాలు, తిరస్కరణలూ ప్రపంచమంతటా ఉన్నాయి. ఆ మార్పుల గురించి వార్తలు మనకిక్కడ తెలియకపోవటం ఒక్కటైతే, మన పరిమిత వార్తా ప్రపంచమే సర్వస్వమని భావించి, ప్రపంచం వైపు దృష్టి సారించకపోవటం మరొకటి అవుతున్నది. నిజానికి ఇందుకు, ఆధునిక ప్రజాస్వామ్యానికి నిలయాలనుకునే పాశ్చాత్య దేశాలు సైతం పూర్తిగా మినహాయింపు కావు. అక్కడ ఇంగ్లండ్‌తో సహా కొన్ని దేశాలలో అసలు నామమాత్రంగానైనా రాచరికాలు ఎందుకున్నట్టు? బ్రిటిష్ వారు కామన్‌వెల్త్ పేరిట, తమ మాజీ వలస దేశాలపై తమ రాచరికం పట్ల విధేయతను రుద్దుతున్నది ఎందువల్ల? కొన్ని యురోపియన్ దేశాల చట్టసభలలో వారసత్వ సభ్యత్వాలు ఎందుకు కొనసాగుతున్నాయి? దీనినంతా అక్కడి ప్రజాస్వామిక వ్యవస్థలు, ప్రజలు ఆమోదించటం ఎందుకోసం? పరిస్థితులు ఇవి కాగా, ఈ వాస్తవాలను విస్మరిస్తూ కొందరు ఇతరులపై వారసత్వాలు, అప్రజాస్వామికతలు అంటూ గురివింద విమర్శలు చేయటంలోని నిజ ఉద్దేశాలు ఏమిటో గ్రహించలేని వారెవరైనా ఉంటారా?

ఇందుకు సంబంధించి అర్థం చేసుకోవలసిన ముఖ్యమైన విషయాలు కొన్నున్నాయి. అధికార వారసత్వాలు, ఆ పద్ధతిలో వచ్చిన వారసులను వారి సమర్థతలను బట్టి ప్రజలు అంగీకరించటం లేదా అంగీకరించకపోవటమన్న సంప్రదాయం ఆదిమ తెగల నుంచే మొదలైంది. తదనంతర యుగాలలో కొనసాగి ఇప్పటికీ కన్పిస్తున్నది. ఇది మొదటి విషయం. బ్రిటిష్ వలసల పాలన ముగిసి ఇక స్వాతంత్య్రం రానుండగా, కొత్త వ్యవస్థలో ఇక రాచరిక వారసత్వాలు ఉండవని గ్రహించిన గతకాలపు రాజవంశాల వారు కాంగ్రెస్‌లో చేరటం లేదా స్వతంత్రులుగా పోటీ చేయటం వంటి మార్గాలలోకి వెళ్లి, తమ ప్రభావంలో గల ప్రాంతాలలో ఆ తర్వాత కూడా రాజకీయ వారసత్వాలు కొనసాగేట్టు చూశారు. అవి పలు చోట్ల ఇంకా ఉన్నాయి. జనసంఘ్, స్వతంత్ర పార్టీలు ఏర్పడినాకా కొందరు వాటిలో చేరారు. ఇది రెండవది. ఆధునికతలు వచ్చినా కొద్దీ వారసత్వాలు బలహీనపడి ప్రజాస్వామికతలు రాగలవనే థియరీలు ఉన్నాయి గాని, ఆధునిక కాలంలోనూ ధన బలం, కులబలం ఉన్నవారు రాజకీయ బలం కూడా సంపాదించి వారసత్వాలను తేలికగా కొనసాగించారు. ఇది మూడవది.

వీటన్నింటి మధ్య, పైన చెప్పుకున్నట్టు, ఎవరి వారసత్వాలు ఏవైనా వారి సమర్థతలు, ప్రజాదరణ అన్నవి ఆ వారసత్వాలు కొనసాగేందుకు లేదా చెదిరిపోయేందుకు ఆధారంగా మారాయి. అది కూడా ప్రజాస్వామ్యమే. ఇటువంటి ప్రజాస్వామిక చైతన్యాలు పెరిగే కొద్దీ, ఎవరి వారసత్వాలు ఏవైనా వాటిపట్ల సంప్రదాయిక భక్తి విధేయతలు బలహీన పడుతున్నాయి. సమర్థత, సుపరిపాలన గీటురాళ్లవుతున్నాయి. అందువల్ల, యథాతథంగా వారసత్వ రాజకీయాల గురించి మితిమీరిన ఆందోళన అక్కరలేదు.




## సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇంటి కింద శివలింగం ఉంది!



**ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇంటి కింద శివలింగం ఉన్నదని నమ్ముతున్నాం. కాబట్టి, అక్కడ కూడా తవ్వకాలు ప్రారంభించాలి. బుల్డోజర్లతో అమాయకుల ఇండ్లను కూల్చడం అభివృద్ధి కాదు, అది విధ్వంసం. సీఎం చేతుల్లో అభివృద్ధి రేఖ లేదు, ఉన్నది విధ్వంస రేఖ మాత్రమే.**

**- అఖిలేశ్ యాదవ్,** ఎస్పీ అధినేత



## సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా

**దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్నాం. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి మా పార్టీ తరపున మద్దతు ప్రకటిస్తున్నాం. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనకు సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నాం. భారతరత్న పురస్కారానికి మన్మోహన్‌సింగ్ అర్హులని భావిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటనతో ఏకీభవిస్తున్నాం.**



**కల్వకుంట్ల తారక రామారావు**

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని, తెలివితేటలను మొదటిసారిగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అనేది నిర్వివాదాంశం. పీవీ దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత ల్యాటరల్ ఎంట్రీ (రాజకీయాలతో సంబంధం లేని వారిని రాజకీయాల్లోకి తీసుకురావడం) ద్వారా రాజకీయాలతో సంబంధం లేని, ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన మంచి ఆర్థికవేత్తగా గుర్తించి మన్మోహన్‌ను ఆర్థికశాఖ మంత్రిగా నియమించారు.

మన్మోహన్‌సింగ్ 1991లో బడ్జెట్ ప్రవేశపెడుతూ.. 'ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది-నా దేశం మేల్కొని ఉన్నది' అంటూ గొప్పగా మాట్లాడారు. ఆ మాటలు.. ఆయన సిద్ధాంతం, నాటి పీవీ నరసింహారావు నాయకత్వం నేడు దేశంలో సమూలమైన విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. 15 రోజులు మాత్రమే ఫారెక్స్ నిల్వలున్న ఆనాటి రోజు నుంచి ప్రపంచమంతా ఆశ్చర్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్‌సింగ్. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా 'సింపుల్ లివింగ్.. హై థింకింగ్' అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్‌సింగ్‌ను మనం చెప్పుకోవచ్చు. విశ్వాసం అనేది నేటి రాజకీయాల్లో చాలా అరుదైన పదం. తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన మహానుభావుడు మన్మోహన్‌సింగ్. ఆర్థికమంత్రిగా, తర్వాత ప్రధానిగా పదేండ్లు పని చేసి, ఆ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత కూడా పార్టీ కోసం పనిచేసిన, అవసరమైతే పూర్తి స్థాయిలో ప్రజాస్వామిక నిరసనల్లో పాల్గొన్న అభ్యుదయవాది, నిరాడంబర మనిషి మన్మోహన్ సింగ్.

ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు వారి క్యాబినెట్‌లో కేంద్ర మంత్రిగా పనిచేశారు. నాటి కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని గెలుపొందిన తర్వాత భాగస్వామ్య పక్షాలను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేసీఆర్‌కు షిప్పింగ్ మంత్రి పదవి ఇస్తే.. డీఎంకేతో చిక్కుముడి ఏర్పడింది. యూపీఏలో ప్రధాన భాగస్వామ్య పక్షం డీఎంకే అభ్యంతరం లేవనెత్తింది. తమకు హామీనిచ్చి వారికి ఎలా ఇస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తే కేసీఆర్ క్షణం కూడా సంకోచించకుండా మన్మోహన్ సింగ్ వద్దకు వెళ్లి 'నేను వచ్చింది పదవుల కోసమో, పోర్ట్‌ఫోలియోల కోసమో కాదు, నేను వచ్చింది తెలంగాణ కోసం' అని చెప్పి కేసీఆర్.. ఆ మంత్రిత్వ శాఖను డీఎంకేకు ఇచ్చారు. ఈ సందర్భంగా 'ఏ నిబద్ధతతో వచ్చారో, అది ఫలించాలని కోరుకుంటున్నాన'ని మన్మోహన్ కేసీఆర్‌తో అన్నారు. 'మీరు తీసుకున్న నిర్ణయంతో గుర్తింపు వస్తుంది, మీరు కర్మయోగిగా గుర్తించబడతారు' అని అన్నారు. ఒక గొప్ప ఆలోచనకు అరుదైన సంద ర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ దానిని ఆపలేదు. దీన్ని మన్మోహన్‌సింగ్ బలంగా నమ్మారు కాబట్టే తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి. కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడింది. దాన్ని మేం మరిచిపోం.

మన్మోహన్‌సింగ్ నిబద్ధతను గుర్తు చేసే సందర్భంలో సరిగ్గా ప్రధానిగా వారు ఎన్నికైన ఆరు నెలలకు.. క్యాబినెట్ సహచరుడిగా 2004, డిసెంబర్ 18 (సరిగ్గా 20 ఏండ్ల కిందట) ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నారని, తమకు సమయం ఇవ్వాలని కేసీఆర్ కోరారు. బలహీన వర్గాలకు చెందిన ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు వంటి నాయకులను తీసుకొస్తున్నా తమకు ఐదు నిమిషాలు సరిపోదని 30 నిమిషాలు కావాలని కోరారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న నాటి ప్రధాని వారికి 45 నిమిషాల సమయం ఇచ్చారు. ఓబీసీలకు అన్ని రాష్ట్రాల్లో మంత్రిత్వ శాఖలున్నాయి. కేంద్రంలో ఓబీసీలకు ఒక మంత్రిత్వ శాఖ ఉండాలని వారు చెప్పడంతో 45 నిమిషాల సమయం ఇచ్చిన మన్మోహన్‌సింగ్ గంటన్నరపాటు వారితో గడిపి సమస్యను పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. చూస్తానంటూ హామీనిచ్చారు. ఇది ఆయన గొప్పతనానికి నిదర్శనం.

ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్‌సింగ్ ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారు. ఎన్నడూ, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదు. ఆయన్ని మనం 'సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా' అని పిలువవచ్చు. ఆయన మన్మోహన్ కాదు, మౌన మోహన్ సింగ్ అని, మౌన ముని అని పేర్లు పెట్టారు. అయితే, అవేవీ పట్టించుకోకుండా ఆయన తన పని తను చేసుకుంటూ పోయారు. విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారు. ఎంతో మంది అనేక రకాలుగా అవమానించే ప్రయత్నం చేసినా ఆయన పట్టించుకోకుండా ముందుకువెళ్లారు. అవమానిస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసినా మహోన్నతులు వణకరు, బెణకరు. అలాంటి స్థితప్రజ్ఞతను మనం మన్మోహన్‌సింగ్‌లో చూశాం.

మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలుగు బిడ్డ.. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలి. మన్మోహన్‌ను రాజకీయాల్లోకి తీసుకువచ్చిందే పీవీ. కేసీఆర్ ఆదేశాల మేరకు నేను, మా పార్టీ రాజ్యసభ సభ్యుల బృందం ఢిల్లీకి వెళ్లి మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించాం. ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించాం. మా సానుభూతి వ్యక్తం చేశాం. ఢిల్లీలో మన్మోహన్‌సింగ్‌కు జరిగిన గౌరవప్రదమైన వీడ్కోలు మన పీవీకి జరుగలేదనే బాధ కలిగింది.

> **మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని, విగ్రహం పెడతామని సీఎం ప్రకటించారు. మేం స్వాగతిస్తున్నాం. ఆయా కార్యక్రమాల్లో మేం కూడా పాల్గొంటాం. మనవాడైన పీవీ నరసింహారావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటుచేయాలని తెలంగాణ శాసనసభ తీర్మానం చేయాలి. మన తెలుగు, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన అసెంబ్లీ నుంచి పంపిస్తే బాగుంటుంది. ఢిల్లీలో ప్రధానులందరికీ స్మారకం ఉన్నది. పీవీకి మాత్రమే లేదు.**

అది మనకు అవమానం, తీరని లోటు. ఈ తీర్మానంతో పాటు దానిని కూడా జతపరిచి పంపించినట్టయితే మన గౌరవం కూడా పెరుగుతుంది. సీఎం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం.

***(బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం నుంచి...)***